ప్రజాశక్తి

శనివారం 21 డిసెంబర్ 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో

నిర్లిప్తంగా ఉంటే వేటు

- అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- కలెక్టర్ వెంకటమురళి ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రెవెన్యూ సమస్యల పరిష్కారంలో బాపట్ల జిల్లా నెంబర్‌వన్‌గా నిలవాలంటే అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి హెచ్చరించారు. రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, అన్ని మండలాల రెవెన్యూ అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లిప్తంగా ఉంటే వేటు తప్పదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి భూ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడానికే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో దిగ్విజయంగా పూర్తి చేయాలన్నారు. జనవరి మూడో తేదీన రీజనల్ స్థాయి రెవెన్యూ అధికారుల సమావేశం ఒంగోలులో జరుగుతుందన్నారు. సమావేశానికి రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియ హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అంశాలన్నింటిలో బాపట్ల జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచే బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ప్రధానంగా 22 ఎ లో భూముల తొలగింపు ప్రక్రియపై పున్ణ పరిశీలన చేయాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల రిజిస్ట్రేషన్ చట్టబద్ధంగా జరిగిందా, లేదా ఉల్లంఘన జరిగితే సమగ్ర పరిశీలన తదుపరి నివేదిక అందజేయాలన్నారు. చుక్కల భూమి, దేవాదాయ భూముల వివరాలు పక్కాగా సిద్ధం చేయాలన్నారు. వీటిపై నిర్లిప్తంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, మండల తహశీల్దార్లు పాల్గొన్నారు.

మన మంత్రులకు

మంచి మార్కులే..!



- గొట్టిపాటి, డోలా ఇద్దరూ శాఖలపరంగా సమర్ధత ప్రదర్శన..
- ఇన్‌ఛార్జి మంత్రులుగానూ కేటాయించిన జిల్లాల్లో ప్రత్యేక దృష్టి
- నియోజకవర్గాల్లోనూ సమస్యలపైనా నిశిత పరిశీలన.. పరిష్కారాలు
- ఇద్దరూ వివాదాలకు దూరంగా పయనిస్తున్నారని విశ్లేషణ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'మీ జాతకాలు నా దగ్గరున్నాయి. మీ పనితీరు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నా..' అని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చగా మారాయి. ఎవరి పనితీరు ఎలా ఉందనే చర్చ పార్టీల్లో ఇపుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఈ తరుణంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ డోలాశ్రీ బాలవీరాంజనేయస్వామి పనితీరుపైనా చర్చ సాగుతోంది. చంద్రబాబు మైండ్‌లో ఇద్దరికీ మంచి మార్కులే ఉన్నట్లు సమాచారం. పార్టీ నేతల్లోనూ, నియోజకవర్గ ప్రజలు, అధికారులు, పార్టీ కేడర్‌లోనూ మంత్రులు ఇద్దరిపైనా పాజిటివ్ అభిప్రాయమే వినిపిస్తోంది. శాఖల పరంగా ఇద్దరూ చంద్రబాబు అంచనాలకు తగ్గట్టుగానే ఉన్నారని సమాచారం. సమీక్షలతో పాటు సమస్యల పరిష్కారంపైనా నిశిత పరిశీలనలోనే ఉన్నారని అధికారవర్గాల సమాచారం. సమస్యలను లోతుగా అధ్యయనం చేసి అధికారులను ప్రశ్నించడంతో పాటు ఎమ్మెల్యేలు అడిగిన అంశాలకూ పరిష్కారాలు చూపాలని జిల్లా యంత్రాంగాన్ని దిశానిర్దేశం చేసి నడిపించడంలోనూ క్రియాశీలకంగానే ఉన్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శాఖ పెద్దది. శాఖాపరమైన నిర్ణయాలు వేగంగా తీసుకోవడంతో పాటు వాటిని క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా యంత్రాంగాన్ని నడిపించడంలో కీలకంగా ఉన్నారు. జిల్లాల్లో ఉన్న విద్యుత్ సమస్యలపైనా ▶ 2లో



మాట్లాడుతున్న రైతుసంఘాలు, కార్మిక సంఘాల నాయకులు

23న కలెక్టరేట్ వద్ద

నిరసన

- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల పిలుపు

▶ 8లో

భూసమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

- సీఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్లు
- అద్దంకి రెవెన్యూ సదస్సులో మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

గత ప్రభుత్వ అధికార దుర్వినియోగం, అస్తవ్యస్త పాలనతో ఏర్పడ్డ భూ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల జిల్లా, అద్దంకిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన... ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అత్యధిక శాతం ప్రజల నుంచి భూసంబంధిత సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తులు రావడంతో... వాటిని శాశ్వత ప్రాతిపదికన వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి.. ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. రెవెన్యూ సదస్సుల ద్వారా గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్ది... భూ సంబంధిత సమస్యలను పరిష్కరించి.. అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

రెవెన్యూ అధికారులతో సమావేశం..

ప్రజల నుంచి అర్జీల స్వీకరణ అనంతరం సంబంధిత రెవెన్యూ ఉన్నతాధికారులు, వీఆర్వోలతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమావేశం నిర్వహించారు. మొత్తం ఎన్ని వినతులు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని నమోదు చేసి, వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని, సమస్య పరిష్కారం అయ్యే వరకూ అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ సమస్యలతో పాటు... విద్యుత్, ఇతర శాఖలకు సంబంధించిన వినతుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తన దష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.1,26,71,093 విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను 111 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రూ.29.80 లక్షల విలువైన ఎల్‌ఓసీలను ఆరుగురు అర్హులకు అందించారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్న మంత్రి గొట్టిపాటి... ఇప్పటివరకు ▶ 2లో

మన మంత్రులకు మంచి మార్కులే.!

(మొదటిపేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు ఆయన టెలీకాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నారు. అధికారులకు తగు ఆదేశాలు ఇస్తున్నారు. విపత్తుల్లోనూ అప్రమత్తంగా ఉన్నారు. అధికారులను కదిలించారు. వరదల్లోనూ వీలైనంత త్వరగా సరఫరాను పునరుద్దరించే చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో ఏ మూలన చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించే గుణం ఉన్న గొట్టిపాటి పరిష్కారాన్ని కూడా అదే స్థాయిలో చూపారు. ఇక నియోజకవర్గంలోనూ వారానికి రెండు రోజులు కేటాయించి గతంలో ఎమ్మెల్యేగా మాదిరిగానే ప్రజలు, పార్టీ కేడర్‌కు అందుబాటులో ఉంటన్నారు. మండల కేంద్రాల్లో ఆయనే స్వయంగా గ్రీవెన్సులు నిర్వహించడం, రెవెన్యూ సదస్సులు పెట్టి గంటల కొద్దీ కూర్చొని జనం చెప్పే సమస్యలు ఓపిగ్గా వింటున్నారు. ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు ఏ ఊళ్లో ఏ సమస్య ఉందో తెలిసిందే.. దీంతో అధికారులను పరిష్కారం ఎలా చేయాలో సులువుగా సూచించే అవకాశం ఉంది. మంత్రిగా రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉన్నందున గతంలో తన వద్ద ఉన్నవ్యక్తిగత సిబ్బంది తో నియోజకవర్గంలో అన్ని వ్యవహారాలూ చూసేలా యంత్రాంగాన్ని ఏర్పాటు చేశారు. పేటలోని తన ఇంటికి నియోజకవర్గానికి క్యాంపు కార్యాలయంగా మార్చారు. ఇక్కడ నుంచే అన్ని సమస్యలు దాదాపుగా పరిష్కారం అయ్యేలా కార్యకలాపాలు చూస్తున్నారు. ఇక పల్నాడు, గోదావరి జిల్లాల్లో ఒక జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్నారు. ఆయా జిల్లాలకు వెళ్లి సమీక్షలు నిర్వహించారు. నియోజవర్గాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లోనూ పాల్గొంటన్నారు. పార్టీపరంగానూ నేతల మధ్య సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఇక మంత్రి డోలా వీరాజంనేయస్వామి విషయానికి వస్తే ఆయన వివాదాలకు దూరంగా ఉండే నాయకుడు. మృదుస్వభావి. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా ఆయన సామాజిక దృష్టితోనే ముందుకు సాగుతున్నారు. శాఖాపరంగా సమర్ధవంతంగానే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నపుడూ అసెంబ్లీలో కొన్ని సందర్భాల్లో కీరోల్ పోషించారు. అధినేత చంద్రబాబుకు స్వామిపై మంచి గౌరవం ఉంది. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక అధికారులతో సమీక్షలు నిర్వహించడంలోనూ, డిఆర్‌సీ వంటి సమీక్షల్లోనూ ఆయన సభ్యులు అడిగిన సమస్యలపై దృష్టి సారించేవారు. తరచూ శాఖలపరంగా సమీక్షలు చేస్తున్నారు. వెలిగొండపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. మంత్రులతో పర్యటనలోనూ ఆయన పాత్రే కీలకంగా ఉంది. వివిధ జిల్లాల్లో పర్యటించే సమయంలో ఆయన ప్రయాణంలో ఎక్కడ హాస్టల్ కనిపిస్తే అక్కడకు వెళ్లి విద్యార్థులకు వసతులు ఎలా ఉన్నాయనే కోణంలోనే పరిశీలన చేస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు పెంచారు. దీంతో అధికారుల్లో ఎంతోకొంత అప్రమత్తత వస్తోంది. జిల్లా కేంద్రంలో రిమ్స్‌ను తనిఖీ చేశారు. ఆయన విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్నారు. ఇప్పటికే ఆయన మూడు సార్లు పర్యటించారు. ఆ జిల్లా నేతలు, అధికారులతో సమీక్ష కూడా చేశారు. అక్కడ అభివృద్ధి ప్రాజెక్టులపైనా దృష్టి సారించారు. స్థానిక నేతలతో కలిసి సమన్వయంతో ఏం చేయాలనే దానిపై అక్కడ చర్చించి ప్రణాళికలు రూపొందించే క్రమంలో ఉన్నారు. ఇక ఇద్దరు మంత్రులూ నియోజకవర్గాల్లోనూ, శాఖలపరంగానూ అవినీతి ఆరోపణలకు దూరంగా ఉన్నారు. వివాదాలకూ దూరంగానే ఉన్నారు. శైలి రీత్యా ఒకరు వేగంగానూ.. మరొకరు నిదానంగా కనిపించినా పనితీరులో మాత్రం ఇద్దరికీ మంచి మార్కులే ఉన్నట్లు సమాచారం.

ప్రకృతి వ్యవసాయంపై గిరిజనులకు శిక్షణ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శివ సదన్‌లో ఆదర్శ సంస్థ ఆధ్వర్యంలో చెంచు గిరిజన రైతులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, కలుపు మందులు అవసరం లేకుండా ఒక్క దేశి ఆవుతో 30 ఎకరాల భూమిని సాగు చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు మార్కెట్‌లో మంచి ధర ఉంటుందని తెలిపారు. ఎన్ఎఫ్ఏ నాగరాజు, ఆదర్శ సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ అడిపి కరుణాకర్, మద్దయ్య, ప్రసాద్, అనందరావు, కాశయ్య పాల్గొన్నారు.

పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూలు బస్సు

తప్పిన పెను ప్రమాదం ● స్కూలుకు నోటీసులు ఇచ్చిన ఎంఇఓ

ప్రజాశక్తి-శింగరాయకొండ


పంట కాలువలోకి వెళ్లిన బస్సు

శింగరాయకొండలో పెను ప్రమాదం తప్పింది. పాఠశాల విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని వస్తున్న స్కూలు బస్సు అదుపుతప్పి పంట కాలవలోకి వెళ్లటం శుక్రవారం చోటు చేసుకుంది. శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న భాష్యం స్కూలు బస్సు పాకల నుంచి విద్యార్థులను తీసుకొస్తున్న సమయంలో పాకల శింగరాయకొండ రోడ్‌లో రోడ్డుపై గుంట రావటంతో ఆ గుంట దగ్గర బస్సు స్టీరింగ్‌కు సంబంధించిన పార్ట్ విరిగిపోవటంతో బస్సు అదుపు తప్పి పక్కన ఉన్న పొలాల గుంటలోకి దూసుకు వెళ్లింది. బస్సులో ఉన్న చిన్నారులు భయాందోళనకి గురై అరుపులు కేకలతో అరవటం మొదలుపెట్టారు. బస్సు డ్రైవర్ అప్రమత్తమై చిన్నారులను బస్సులో నుంచి బయటకు దించారు. వెంటనే విద్యార్థులను మరో బస్సులో పాఠశాలకు తరలించారు. అక్కడ కాలువలో ఇరుక్కున్న బస్సును మరో బస్సు ద్వారా బయటకు తీశారు. మండల విద్యాశాఖ అధికారి కత్తి శ్రీనివాసరావు వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు భాష్యం స్కూల్‌కు వెళ్లి స్కూలు బస్సుకు సంబంధించి ఆ బస్సుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని, ఈ ప్రమాదంలో విద్యార్థులకు ఏమైనా జరిగిందనే విషయంపై ఆరా తీసి నోటీసును అందజేశారు.

స్థల వివాదంలో నిందితులకు శిక్ష

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని మాచవరం గ్రామంలో స్థలవివాదంలో నిందుతులకు శిక్షపడిన సంఘటన వివరాలు శుక్రవారం ఎస్ఐ బి శ్రీకాంత్ తెలిపారు. వివరాల మేరకు మాచవరం గ్రామానికి చెందిన మద్రావుల సుబ్బారావు అతని భార్యతో కలిసి 2018లో వారి స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి గుంటలు తీసుకుండగా అదేగ్రామానికి చెందిన మద్రావుల శ్రీనివాసరావు, అతని భార్య పార్వతి, కుమార్తె లక్ష్మిల అక్కడకు వచ్చి గుంటలు తీయవద్దు అని గొడవకు దిగి సుబ్బారావు అతని భార్యలపై దాడిచేయగా వారి తీవ్రగాయాలై రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి కోర్టుకు పంపారు. అప్పటి నుంచి విచారణ జరుగుతుంది. దాంతో ప్రస్తుత ఎస్ఐ శ్రీకాంత్ సరైన సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టగా జెఎఫ్‌సి ఎం ఎక్సైజ్ కోర్టు జడ్జి కోమలివల్లి ఏ1 నిందుతునికి 2సంవత్సరాలు జైలుశిక్ష, 7 వేల రూపాయలు, అలాగే ఏ2 నిందితురాలికి 2 వేల రూపాయలు, ఏ3 నిందితురాలికి 2 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-మద్దిపాడు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఎస్ఐ శివరామయ్య అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులో విద్యార్థులచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామయ్య మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించి వాహనం చేయాలన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు అని చెప్పారు. అదేవిధంగా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ప్రయాణం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ర్యాలీలో పోలీసులు హెల్మెట్లు ధరించగా, విద్యార్థులు ఫ్లెక్సీ పట్టుకొని ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, స్థానికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

భూసమస్యలకు సత్వర పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

అద్దంకి నియోజకవర్గంలో సుమారు రూ.3,68,74,641 సిఎంఆర్ఎఫ్ నిధులను బాధితులకు అందించినట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయంలో సామాన్యులకు వైద్యం అందని ద్రాక్షగానే వున్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రూ.2.60 కోట్ల సిఎస్ఆర్ నిధులతో కమ్యూనిటీ హాళ్లు

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద... సామాజిక బాధ్యతగా.. అద్దంకి నియోజకవర్గ పరిధిలో విద్యుత్ శాఖ కు చెందిన సుమారు రూ. 2.60 కోట్లతో... 11 కమ్యూనిటీ హాళ్లను, ఒక కళాశాల భోజన శాలను నిర్మిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ఎస్సీ, బీసీ, మైనారిటీ కాలనీలలో ఎక్కువగా ఈ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. అదే విధంగా గత ప్రభుత్వ హయంలో మధ్యలోనే నిలిచిపోయిన కొన్ని నిర్మాణాలను పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నూతన విద్యుత్ సంస్కరణలను ప్రతిఘటించాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్


సమావేశంలో మాట్లాడుతున్న జీవీ కొండారెడ్డి

ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యుత్ విధానాలను ప్రతిఘటించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జీవీ కొండారెడ్డి కోరారు. గిద్దలూరు యుటిఎఫ్ కార్యాలయంలో నూతన విద్యుత్ ఛార్జీల అమలుపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ విద్యుత్ బాదుడే బాదుడును ఈ తెలుగుదేశం ప్రభుత్వం ఇప్పుడు చాలా ప్రతిష్టాత్మకంగా అమలుపరుస్తూ ప్రజలపై విపరీతమైన విద్యుత్ భారాలను మోపుతున్నదని, వాటిని ప్రజలు అక్కడక్కడా తిరస్కరిస్తూ ప్రతిఘటిస్తున్నారని, కొన్ని చోట్ల విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్నారని కొండారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకి 'సౌర విద్యుత్ ఒప్పందం కుదుర్చుకోవటానికి ఆదాని కంపెనీలు రూ.1,750 కోట్లు లంచం ఇచ్చాయన్న కుంభకోణం అమెరికాలో బయటపడిందని, ఇంత పెద్ద కుంభకోణం బయటపడినా మన ఎన్డీయే కూటమి ప్రభుత్వం నాయకులు మాత్రం మౌనం వహిస్తూ ఎలాంటి దర్యాప్తులు చేపట్టకపోగా దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజలు చైతన్యవంతమై గంపగుత్తగా దేశ సంపదను దోచుకుంటున్న పాలకులు, పెట్టుబడిదారులను అడ్డుకునేందుకు ప్రజలు చైతన్యవంతం కావాలని కొండారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు టీ ఆవులయ్య, మండల కమిటీ సభ్యులు బి నరసింహులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

ప్రకాశం జిల్లా ఒంగోలు టౌన్ కొణిజేడు బస్టాండ్ వద్ద లాయర్ పేట డోర్ నెంబర్ 5-1-50(8) నివాసం ఉంటున్న నిస్సంకి వెంకటసుబ్బయ్య గారి కుమారుడు నిస్సంకి వెంకటస్వామి అను నేను 11.12.2024 వ తేదీన ఒంగోలు రైల్వే స్టేషన్ వద్ద పని చూసుకొని కొత్తపట్నం బస్టాండ్ వద్ద టీ తాగటానికి నా బండి ఆపుకుని టీ తాగుటకు వెళ్ళినాను, సదరు సమయంలో నా యొక్క బండి హ్యాండిల్‌కు నా యొక్క డాక్యుమెంట్స్ కవరు తగిలించి ఉన్నది. సదరు డాక్యుమెంట్ నెంబర్ 638/2007 సంతనూతలపాడు సబ్ రిజిస్టర్ ఆఫీస్ నందు కొట్టే వెంకట రామరావు గారి కుమారుడు వెంకట విజయ్ కృష్ణ అను వారి పేరు మీద తేది 09-02-2007 న రిజిస్టర్ కాబడి ఉన్నది. నేను టీతాగివచ్చి చూసుకోనుగా నాబండి హ్యాండిల్ కు తగిలించిన కవరు మరియు డాక్యుమెంట్స్ పోయినవి. చుట్టుపక్కల వెతికిననూ కనిపించలేదు కావున దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు గాని,చిరునామా కు గాని, తెలియపరచవలసిందిగా కోరుచున్నాను

ఇట్లు
నిస్సంకి వెంకటస్వామి
తండ్రి వెంకటసుబ్బయ్య
లాయర్ పేట, ఒంగోలు
సెల్ నెంబర్ : **9963145099**

మహారాజశ్రీ ఒంగోలు ఫ్యామిలీ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

CRL .M.P. NO.613/2024
MC No. 35/2018

పూల రమణ వగైరాలు ....పిటిషనర్స్
వర్సెస్
పూల వెంకటరావు ... రెస్పాండెంట్

To
పూల వెంకట రావు,తండ్రి రామయ్య
హిందూ, బెల్దార్ మేస్త్రీ, గడ్డమీద పల్లె గ్రామం,
వీరభద్ర పురం పోస్ట్, యర్రగొండపాలెం,
మండలం, ప్రకాశం జిల్లా. పిన్ 523327

పై పిటీషన్ లో మీకు కోర్టు వారు మీకు ఎన్ని సార్లు నోటీసు పంపిననూ తీసుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు జారీ నిమిత్తం వాయిదా 06.01.2025 వ తేదికి వేసియున్నారు ఆ రోజు ఉదయం గం 10.30 లకు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపగలరు అట్లు లేని యెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
MD యాసిన్ MA LLM
D.ఏడుకొండలు
U. వెంకటేశ్వర్లు
P.అజయ్ గౌడ్
పిటిషనర్ తరపున అడ్వకేట్స్
ఒంగోలు

జనరల్ నోటీసు

మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఒంగోలు

OS No: 1109/2023

Between
చిమ్మిరి బాలకృష్ణ ... వాది
మరియు
కొంపల్లి నాగ విజేత మరియు ఇతరులు
... ప్రతివాదులు

పై తెలిపిన గౌరవ కోర్టులో చిమ్మిరి బాలకృష్ణ అనువారు కొంపల్లి నాగ విజేత మరియు కొంపల్లి రమాదేవి అనువారల మీద పై తెలిపిన గౌరవ కోర్టులో దావా దాఖలు చేసిఉన్నారు. ఈ దావాలో కోర్టు వారు మొదటి ప్రతివాది అయిన కొంపల్లి నాగ విజేత అనే మీకు పలుమార్లు నోటీసులు పంపించగా మీరు వాటిని తీసుకోకుండా కావాలనే Aviod చేయుచున్నందున వాది ప్రార్ధనమీరకు పై తెలిపిన గౌరవ కోర్టు వారు పేపర్ పబ్లికేషన్ ద్వారా ఈ దావా లో మొదటి ప్రతివాది అయిన మీకు నోటీసు ఇవ్వమని ఆదేశాలు ఇవ్వడమయినది కావున గౌరవ కోర్టు ఆదేశాలమేరకు పై తెలిపిన దావాలో మీకు ఈ పేపర్ పబ్లికేషణ్ ద్వారా తెలియజేయుచున్నాము వాయిదా తేది 10-01-2025కు ఈ కేసును వాయిదా వేయటం జరిగినది కనుక ఆ రోజున మీరు పై తెలిపిన గౌరవ కోర్టులో హాజరు కావలెనని ఈ పేపర్ పబ్లికేషన్ ద్వారా తెలియజేడమైనది.

ఒంగోలు
తేది : **19-12-2024** ఇట్లు
గంగవరపు మార్కు బాబు
అడ్వకేట్, ఒంగోలు

నోటీసు

ఒంగోలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A.162/2019
in
E.P.175/2017
in
O.S.736/2015

Between:
శ్రీమతి మాగులూరి పద్మప్రియ వగైరా ..పిటిషనర్స్
V/s.
మానం శ్రీవెంకట ఉపేంద్రబాబు వగైరా
... రెస్పాండెంట్స్

To
R2) రాచాబత్తుని కుమారస్వామి @ కుమార్,
S/o లేటు రామమోహన్, వయసు 50 సం।।లు,
హిందూ, రియల్ ఎస్టేట్ మరియు ప్రైవేట్ చీటీల వ్యాపారం, R/o డోర్ నెం.6-114. శ్రీనగర్ కాలనీ, కర్నూల్ రోడ్, ఒంగోలు, ఒంగోలు JCJ.

పై నెంబరు పిటిషనును. పిటిషనర్లు ఆర్డర్ 21, రూల్ 58 CPC క్రింద దాఖలు చేయగా, సదరు పిటిషనులో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది: 28-01-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు స్వయముగా గాని, లేదా వకీలు ద్వారా గాని శ్రీ కోర్టునందు ది28-01-2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేయని ఎడల పై పిటిషనును మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టువారి అనుమతితో //

వాయిదా తేదీ: **28-01-2025.**

ఇట్లు
A. సత్యనారాయణ,
అడ్వొకేట్, కొత్తపేట,చీరాల

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం

బాపట్ల ఎస్‌పి తుషార్ దూడి



మాట్లాడుతున్న ఎస్‌పి తుషార్ దూడి

ప్రజాశక్తి - చీరాల, కారంచేడు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని బాపట్ల ఎస్‌పి తుషార్ డూడి హెచ్చరించారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలోని చీరాల వన్‌టౌన్, కారంచేడు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్ల పరిసరాలు, వివిధ నేరాలలో సీజ్ చేసిన హనాలను పరిశీలించారు. అదేవిధంగా క్రైమ్ రికార్డులను పరిశీలించారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని పొందుపరుస్తూ సక్రమంగా రికార్డులను నిర్వహించాలన్నారు. నేరాలు, వాటి దర్యాప్తు గురించి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడారు. వారు నిర్వహిస్తున్న విధులు, శాఖపరంగా ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. శాఖ పరమైన సమస్యలను స్వయంగా తనకు తెలియజేయాలన్నారు. ఆ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ మహిళా పోలీసుల సహకారంతో ఒంటరిగా నివాసముండే మహిళలు, వద్దుల యొక్క వివరాలను సేకరించాలన్నారు. ఆ ప్రాంతాలలో పెట్రోలింగ్ నిర్వహిం చాలన్నారు. తరచూ వారి గహాలను సందర్శించాలని ఆదేశించారు. ఒంటరిగా నివాసం వుంటున్న వారు తమ గహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా ఇంటికి ఎవరు వస్తున్నారనే విషయాన్ని ముందుగానే తెలుసుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఎవరి ప్రవర్తనపైనైనా అనుమానం కలిగిన వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. కొందరు వ్యక్తులు నిర్లక్ష్యంగా, అతి వేగంగా వాహనాలు నడపడం, రోడ్డు భద్రత నియమాలు పాటించక పోవడం వల్ల సంభవిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. వారు చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాలను కట్టడి చేసేందుకు ముఖ్యమైన కూడళ్ళు, రహదారులపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్‌పి ఎండి. మోయిన్, చీరాల టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, కారంచేడు ఎస్ఐ వెంకటరావు, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రజాశక్తి- వేమూరు

ప్రేమ, దయ, శాంతికి యేసు క్రీస్తు మార్గదర్శి అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాల యంలో క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని మతాలను గౌరవించే గొప్ప నాయకుడని కొని యాడారు. క్రిస్టియన్ల సంక్షేమం, అభివద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాస్టర్లు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : స్థానిక ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల సిఇఒ సిహెచ్. ఉమామహేశ్వరరావు, డీన్ ఎస్.శివన్నారాయణ, కళాశాల ప్రిన్సిపల్ విచారపు కిషోర్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం : క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని కర్లపాలెం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె. రత్న జ్యోతి తెలిపారు. స్థానిక శ్రీ భార్గవిహై స్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోపర్తి జాన్ ప్రత్యేక ప్రార్థన నిర్వహించి క్రిస్మస్ కేక్ ను కట్ చేశారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సెక్రెటరీ కరస్పాండెంట్ పేరాల వెంకట సురేష్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, వ్యాపారవేత్త కామరాజు గడ్డ రమేష్, మందపాటి పరమానంద కుమార్, ఉపాధ్యాయులు దివ్య, ప్రేమావతి, రిజ్వానా, కుమారి, లతా, సాహితీ, నవీన్, నాగమ్మ, సుందరమ్మ, బేబీ పాల్గొన్నారు

.వేటపాలెం :మండల పరిధిలోని పందిళ్ళపల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు పంచాయతీ సెక్రెటరీ తాటి మాల్యాద్రిరావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేశారు ఈ సందర్భంగా పాస్టర్ వెస్లీకుమార్ క్రీస్తు బోధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బొగ్గుల పార్థసారథి, ప్రధాన కార్యదర్శి పల్లపోలు శ్రీనివాసరావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు పేరిశ్రీట్ల బాలచంద్ర, జనసేన పార్టీ నాయకులు ఆర్కే నాయుడు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-వేటపాలెం

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వేటపాలెం ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు తెలిపారు. వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం పంచాయతీ పరిధిలోని జబ్బర్ కాలనీలో శుక్రవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోజురోజుకీ సైబర్ నేరాలు పెరిగిపోతున్నట్లు తెలిపారు. మొబైల్‌కి వచ్చిన ఓటిపిలను ఎవరికి చెప్పరాదన్నారు సైబర్ నేరగాళ్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచారిస్తుంటే పోలీలసు సమాచారం అందించాలన్నారు. ప్రజల రక్షణ పోలీసుల బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతినిత్యం నిత్యావసర సరుకులు కొనుగోలు చేసే వినియోగదారులు తూనికలు కొలతలు పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ (నెల్లూరు ప్రాంతీయ అధికారి) కె. ఐజక్ తెలిపారు. ఈనెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, వినియోగదారులకు తూనికలు కొలతలు పట్ల అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బాపట్ల తూనికలు కొలతల ఇన్‌స్పెక్టరు బి.రామదాసు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజాక్ మాట్లాడుతూ తెల్లారింది మొదలు రాత్రి నిద్రించేవరకూ వినియోగదారులు ఏదో ఒక వస్తువు కొనుగోలు చేస్తుంటారని తెలిపారు. వస్తువు నాణ్యతతో పాటు తూనికలు కొలతలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ బి. రామదాసు మాట్లాడుతూ పలువురు వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతుంటారు. తూకంలో తేడా ఉందని అనుమానం వచ్చిన వెంటనే తూనికలు కొలతల అధికారులకు తెలియజేయాలన్నారు. విలువైన వస్తువులను కొనుగోలు చేసే సమయాల్లో తూనికలు కొలతలు పట్ల అత్యంత జాగురూకతతో వ్యవహరించాలన్నారు. తూనికల్లో అనేక విధాలుగా వ్యాపారులు వినియోగదారులను మోసగిస్తుంటారని తెలిపారు. వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరిస్తూ తూనికలు కొలతలపట్ల తీసుకోవాల్సి జాగ్రత్తలపై అధికారుల సూచనలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు వీటి పట్ల అవగాహన కల్పించుకొని తల్లిదండ్రులకు ఇరుగుపొరుగు వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.తూనికలు కొలతల్లో మోసాలు జరిగితే తక్షణమే తూనికలు కొలతల అధికారులు ఫిర్యాదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు, తూనికలు కొలతల కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తూనికలు, కొలతల ఇన్‌స్పెక్టర్ రామదాసు



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన అనీల్ పాపారావు

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి మద్దిపాడు

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని దొడ్డవరం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనీల్ పాపారావు (30) కరెంటు మోటార్ మెకానిక్‌గా, వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో వీరప్ప చెరువు వద్ద బోరు మోటర్‌కు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ గురై పక్కనే ఉన్న చెరువులో పడి మతి చెందాడు. మతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ,కుమారుడు ఉన్నాడు. మతుడు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మార్టూరు

బైకు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన మార్టూరులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. బల్లికురవ 108 వాహన సిబ్బంది మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దిలీప్ కుమార్, అతుల్, పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మద్దిరాలలో గ్రానైట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ శుక్రవారం రాత్రి బైకుపై మార్టూరులో గ్రానైట్ కార్మికుడిగా పనిచేస్తున్న తమ స్నేహితుడి వద్దకు వచ్చారు. ముగ్గురు కలిసి మార్టూరు నుంచి నాగరాజుపల్లి వైపు వెళ్లే రోడ్డులో వెళ్తున్నారు. బైకు బ్రిడ్జి సమీపంలో వచ్చే సరికి అదుపుతప్పి రోడ్డు బోల్తా కొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

యల్లారెడ్డికి పితృ వియోగం

ప్రజాశక్తి-చుండూరు

చుండూరు గ్రామానికి చెందిన టిడిపి మండల అధ్యక్షుడు గుదేటీ యల్లారెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి గుదేటి సీతారామి రెడ్డి (77) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. సీతారామిరెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పిం చారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి-బాపట్ల : బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని జిబిసి రోడ్డుకు ఇరువైపుల ఫుట్ పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు . ఫుట్‌పాత్‌లపై దుకాణాలు నిర్మించుకొని వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలన్నారు. పురపాలక సంఘం సూచనలను ఉల్లంఘిస్తే శనివారం ఉదయం పది గంటల నుండి పురపాలక సంఘ సిబ్బంది ఆక్రమణలు తొలగిస్తారని ఆయన హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-మేదరమెట్ల

గత ప్రభుత్వం హయాంలో నిలిపివేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి ఈ ప్రాంత రైతులకు న్యాయం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం. ఆంజనేయులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విన్నవించారు. అద్దంకి తహశీల్దారు కార్యాలయం శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదుస్సులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వివిధ సమస్యలపై మంత్రికి అర్జీ అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎర్రం చినపోలి రెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.106 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అయితే నిధులు మంజూరు చేయలేదని తద్వారా ప్రాజెక్టు నిరుపయోగంగా మారినట్లు తెలిపారు. తమ్మవరం-2 ఎత్తిపోతల పథకానికి సుదీర్ఘ కాలంగా మరమ్మతులు చేపట్టక పోవడంతో అలంకారప్రాయంగా మారినట్లు తెలిపారు.కోరిశపాడు, ప్రసంగలపాడు గ్రామాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించినప్పటికీ వాటిలో ఇప్పటికీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రాలేదని తెలిపారు. పాత భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాద భరితంగా తయారైనట్లు తెలిపారు. కొత్త భవనాల్లోకి ఆరోగ్య కేంద్రాలను తరలించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ సమస్యలు తమ దష్టిలో ఉన్నాయని, గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయింపులు తప్ప నిధులు ఇవ్వలేదని తెలిపారు. దీంతోకాంట్రాక్టర్లు ప్రాజెక్టులను వదిలి వెళ్లిపోయినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం తన కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నిర్మించిన కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు ఆయా భవనాలను అప్పగించలేదని తెలిపారు. అందువల్లే వైద్య సేవలను కొత్త భవనాల్లోకి మార్చలేకపోయామని తెలిపారు. ఈ విషయమై సంబంధిత మంత్రి మాట్లాడి సత్వరమే పరిష్కారానికి తగిన కృషి సాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు దశరథ, రవీంద్రబాబు, కోటేశ్వరరావు, సుబ్బారావు, హరిబాబు, యోహాను తదితరులు పాల్గొన్నారు.


మంత్రి వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మంత్రికి విశ్రాంత ఉద్యోగుల వినతి

అద్దంకి : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని ప్రకటించాలన్నారు. అప్పటి వరకూ 35 శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు పిఆర్‌సి, కరువు భత్యం బకాయిలను చెల్లించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. కమ్యుటేషన్ ఎమౌంట్ రికవరీలు 15 నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలన్నారు. 11వ పిఆర్‌సిలో ఇచ్చిన గ్రాట్యుటీ రూ.16 లక్షల రూపాయలను 1-07-2018 నుంచి అమలు చేయాలన్నారు. క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 10వ పిఆర్‌సి ప్రకారం అమలు చేయాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి రవికుమార్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల-2 అధ్యక్షులు రావుల బాపయ్య చౌదరి, జిల్లా కోశాధికారి పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి కరి కమలేశ్వరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ టి.కష్ణయ్య, అద్దంకి మండల బాధ్యులు షేక్ మస్తాన్, మారం కోటేశ్వర రావు, బత్తుల అంజయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అద్దంకిలో వినతి పత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఈత పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-బాపట్ల



చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈనెల 21న ఈత పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఉప్పాల జ్ఞాన వివేక్ గౌడ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ షేక్ నజీర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 10న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈత పోటీల్లో జ్ఞాన వివేక్ గౌడ్ పాల్గొని ప్రతిభ చూపి చెన్నైలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞాన వివేక్‌ను కళాశాల పీడీ మల్లికార్జున, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


విద్యార్థికి ప్రశంసా పత్రం అందజేస్తున్న అధికారులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి - పంగులూరు

జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 24 వరకూ ఉన్నత పాఠశాల బాల బాలికలకు బాపట్ల జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండల పరిధిలోని కొండమంజులూరు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన, వక్తత్వ పోటీలలో కొండమంజులూరు విద్యార్థులు ప్రథమ స్థానం లభించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత శుక్రవారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థి జాచాతరాజుపల్లి పవన్ గోపికష్ణ వ్యాసరచన పోటీలో ప్రథమ స్థానం, 9వ తరగతి చదువుతున్న కప్పెర జాన్ బాబు వక్తత్వ పోటీలో ప్రథమ స్థానం సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ విద్యార్థులు ఈనెల 23న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సాదిక్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలకు పవన్ గోపికష్ణ ,జాన్ బాబును పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గోలి సంధ్యారాణి ,వైస్ చైర్మన్ రావుల వెంకట నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది,గ్రామ పెద్ద సహదేవుడు, దాత నాగేశ్వరావు అభినందించారు.

ప్రత్యేక అధికారుల నియామకం

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపిడిఒ పి.శివ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండల పరిధిలోనికొత్తపేట, దేశాయిపేట గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారిగా ఎంపిడిఒ శివ సుబ్రహ్మణ్యం, వేటపాలెంకు సిడిపిఒ ఉమా, చల్లారెడ్డి పాలెం, పాపాయి పాలెంకు ఇఒఆర్‌డి శ్రీనివాసరావు, అక్కయ్యపాలెం, పుల్లరిపాలెం పందిళ్ళపల్లికి ఆర్డబ్ల్యుఎస్ ఎఇ నాగరాజును ప్రత్యేక అధికారిగా నియమించినట్లు ఎంపిడిఒ తెలిపారు

బిఎల్‌ఒలతో సమీక్ష

ప్రజాశక్తి-భట్టిప్రోలు

నూతన ఓటరు జాబితా తయారీలో బిఎల్‌ఒలు తగు జాగ్రతలు పాటించాలని తహశీల్దారు మేక శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో స్పెషల్ సమ్మరీపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ బిఎల్‌ఒలకు అప్పగించిన విధులు క్రమం తప్పకుండా పాటించాలన్నారు. ఫారం 6,7,8 సక్రమంగా పూర్తి చేసి తప్పులు లేకుండా నూతన ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ ఫణి కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రసన్న, విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి- చెరుకుపల్లి


మాట్లాడుతున్న న్యాయవాది ఝాన్సీ

ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఉచిత న్యాయ సహాయం పొందే హక్కు ప్రతి మహిళకు ఉంటుందని, ఎలాంటి వివక్షకు తావు లేకుండా తగిన న్యాయ సహాయం అందజేస్తారని సీనియర్ న్యాయవాది మరియు రిసోర్స్ పర్సన్లు ఝాన్సీ, కాళిదాసు తెలిపారు. జాతీయ మహిళా కమిషన్ మరియు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ చట్టాల పట్ల మరియు మహిళలకు సంబం ధించిన హక్కులు విధివిధానాల పట్ల అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, ఫొక్సో చట్టం, గహహింస, పనిచేసే ప్రదేశాలలో లైంగిక వేధింపులు, వరకట్న నిషేధ చట్టం, హిందూ వివాహ చట్టం, భరణం, వివాహ రద్దు చట్టం, లింగ వివక్షతో కూడిన వేతనాలు తదితర అంశాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ అనీల్ కుమార్ మాట్లాడుతూ వేధింపులు, ఇబ్బందులకు గురైన మహిళల కోసం పోలీసు స్టేషన్‌లో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నట్లు తెలిపారు. మహిళా పోలీ సులు అన్నివేళలా అందుబాటులో ఉండి మహిళలకు రక్షణగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్ ఆర్‌డి కేజీ ఏ.శ్రీనివాసన్, కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణ నాయక్, మహిళలు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

రైతు సంఘం జిల్లా నాయకులు కందిమళ్ల రామ కోటేశ్వరావు

ప్రజాశక్తి - పంగులూరు


మాట్లాడుతున్న రామకోటేశ్వరరావు

రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని రైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు కందిమళ్ల రామ కోటేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం తలుచుకుంటే రేషన్ బియ్యం అక్రమ రవాణా, అక్రమ వ్యాపారాన్ని అరికట్టే మార్గం ఉందన్నారు. రేషన్ బియ్యాన్ని వినియోగదారులు ఉపయోగించుకోవడం లేదన్నారు. కొందరు బియ్యాన్ని అక్రమ రవాణా, వ్యాపారం చేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఉత్పత్తిదారులకు కూడా కనీస మద్దతు ధర లభించడం లేదన్నారు. ప్రభుత్వం రైతుల దగ్గర ధాన్యం మొత్తం కొని, రేషన్ అవసరాలకు సరిపడినన్ని ఎప్పటికప్పుడు మిల్లింగ్ చేసి చౌక ధరల దుకాణం దుకాణాలకు సరఫరా చేయాలన్నారు. అలా చేయటం వలన లబ్ధిదారులందరూ ఖచ్చితంగా బియ్యం తీసుకొని తింటారని చెప్పారు. దీంతో అక్రమ రవాణా , అక్రమ వ్యాపారం ఉండదన్నారు. ఎగుమతులకు కూడా ఎప్పటి కప్పుడు అవసరం మేరకు మిల్లింగ్ చేసి బియ్యం పంపవచ్చని తెలిపారు. ధాన్యంగా ఎంత కాలం నిల్వ ఉన్నా పురుగు పట్టదని, బియ్యం నిల్వ ఉంటేనే కొద్దిరోజులకే పురుగు పడుతుందని ఆయన తెలిపారు. బియ్యం పురుగు పట్టకుండా ఉండాలంటే రసాయనాలు వాడాల్సి వస్తుం దన్నారు. రసాయనాలు వాడినందువలన వాసన వస్తుందని, అందువలన వినియోగ దారులు తినకుండా అమ్ముకుంటున్నారని తెలిపారు. బియ్యం బదులు ధాన్యం నిల్వ ఉంచితే కొంత ఖర్చు అవుతుందని, ఆ ఖర్చులను వినియోగ దారులపై వేసిన భరించేందుకు వారు సిద్ధమవుతారని ఆయన తెలిపారు.

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం : ఏలూరి

ప్రజాశక్తి -మార్టూరు రూరల్

నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పిం చేందుకు ఎమ్మెల్యే ఏలూరి ఏర్పాటు చేసిన గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ప్రముఖ కంపెనీ హెచ్‌ఆర్ అండ్ కో కంపెనీతో శుక్రవారం కీలక ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా పర్చూరు నియోజకవర్గంలో పదివేల మందికి ఉపాధి కల్పించడమే తన లక్ష్యమన్నారు. ఇందుకోసం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా ఎంప్లాయిమెంట్ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎంప్లాయి మెంట్ సెల్ ద్వారా నియోజక వర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు వారి అర్హతలను బట్టి వివిధ కార్పొరేట్ కంపెనీలలో ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలోని ప్రతి గ్రామానికి ఎంప్లాయి మెంట్ సెల్ ఎగ్జిక్యూటివ్ వచ్చి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరికి వారి అర్హతలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలలు కలిస్తారని తెలిపారు. విద్యార్హతను బట్టి రూ.12 వేల నుంచి రూ.60 వేలు వరకూ వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలోని నిరుద్యోగ యువతీ యువ కులు ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏలూరి కోరారు. ఈబేటిలో హెచ్‌ఆర్ కో కంపెనీ ప్రతినిధులు హర్ష రెడ్డి, కార్తీక్ ప్రత్తిపాటి పాల్గొన్నారు.


కంపెనీ ప్రతినిదులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని

విద్యుత్ బిల్లు తగ్గించుకోండి

సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రభుత్వ రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకొని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ముగింపు సందర్భంగా కలెక్టరేట్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులతో నిర్వహించిన ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. ఇంధనం అందరికీ అవసరమని ప్రజలు అందరు కూడా జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. ఇంధనాన్ని ప్రజలు ఆదా చేసి భావితరాల భవిష్యత్తుకు మరింత ఇంధనాలు అందించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం



జెండా ఊపి..ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ

300 యూనిట్లు లోపు గృహాలకు రాయితీపై సోలార్ విద్యుత్తును అందించడానికి చర్యలు తీసుకుందన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు, ఎడిఇ శ్రీనివాసరావు, ఏఈ పెరుగు శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఆర్టీసీని రక్షించుకుందాం

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అయ్యపరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఐక్య ఉద్యమాలతో ఏపీఎస్‌ఆర్టీసీని రక్షించుకుందామని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యపరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా మహాసభ జరిగింది. ఈ మహాసభకు బీ వెంకటేశ్వరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అయ్యపరెడ్డి మాట్లాడుతూ కాంటాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, వారి వేతనాలు ప్రతి నెలా చెల్లించాలని డిమాండ్ చేశారు. మహాసభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి,



మాట్లాడుతున్న అయ్యపరెడ్డి

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు ప్రసంగించారు. మహాసభలలో పి.శ్రీనివాసరావు, అల్లడి సుబ్బారావు, డీకే రావు, పి.బ్రహ్మయ్య, విజయకుమార్, ఎస్‌డి పీరావళి, యస్‌కే మీరావలి, ఉప్పుటూరు వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, జీవీ సుజాత, యు.కాశీరత్నం పాల్గొన్నారు.

పసల్ బీమా పథకం కింద

రైతులను లబ్ధిదారులుగా చేర్చాలి

కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రధానమంత్రి పసల్ బీమా పథకం కింద రైతులను లబ్ధిదారులుగా చేర్చాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పీఎం పసల్ బీమా పథకంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో జరిగింది. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకి లబ్ధి చేకూరేలా బీమా పథకాన్ని వర్తింపజేయాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతం బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు బాపట్ల జిల్లాలో 1.40 లక్షల మంది ఉన్నారన్నారు. సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలు రైతులు 23 వేల మంది ఉన్నారన్నారు. రైతులే ప్రీమియం చెల్లించేలా చైతన్య పరచాలన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఏడు పంటలకు బీమా అమలవుతుందన్నారు. ప్రకతి విపత్తు సమయంలో పంటలు దెబ్బతిన్న వారందరికీ బీమా వర్తిస్తుందనే విషయాన్ని చాటి చెప్పాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకష్ణ, ఉద్యానవన శాఖ అధికారి జెన్నెమ్మ, జలవనరుల శాఖ ఎస్ఈ వెంకటరత్నం, సిపిఓ శ్రీనివాస్, ఎల్ డి ఎం శివకృష్ణ, టాటా ఏఐజి ఏజెన్సీ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వెలుగు ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ- వెలుగు ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవనంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.పద్మ వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ సందేశం వినిపించారు. ఏసుక్రీస్తు యొక్క ప్రేమను దయను మనందరం కూడా కలిగి ఉండాలని ఒకరినొకరు ప్రేమించాలని ఆ పరిశుద్ధమైన దేవుని వైపు చూడాలని ప్రాజెక్టు డైరెక్టర్ పద్మ తెలియజేశారు. దైవజనులు ఆనంద్ పాల్ క్రిస్మస్ సందేశాన్ని యేసు పుట్టుక గురించి



మాట్లాడుతున్న పీడీ పద్మ

వివరించారు. డిపిఎం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కేక్ కటింగ్, వాగ్దానాలు, క్యాలెండర్ మొదలైన వాటిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపిఎంయు సిబ్బంది, ఏపిఎంలు, సీసీలు, మండల సమైక్య అధ్యక్షులు, అకౌంటెంట్లు ,కాల్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి నిర్వహిస్తున్న ఒంగోలులోని హౌసింగ్ బోర్డ్‌లో ఉన్న శక్తి సదన్‌లో క్రిస్మస్ సందర్భంగా ప్రముఖ కవి గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ శక్తి సదన్ హోమ్‌లోని పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాలు అందరికీ శుభదినాలని, ఆ సందర్భంగా అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. పిల్లలు పెద్దవారు చదువుకోవటానికి వీలుగా కుర్చీలు పంపిణీ కూడా చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ, కోశాధికారి బీరం అరుణ, ఉద్యోగులు సిహెచ్.కనకదుర్గ, గుంటుపల్లి శ్రీదేవి, మలాన్‌భాను, నాగేంద్రమ్మ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన

ప్రజాశక్తి-బాపట్ల

పార్లమెంట్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను సమాజవాదీ పార్టీ బాపట్ల జిల్లా శాఖ అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం బాపట్ల పట్టణం, జమ్ములపాలెం ఫ్లైఓవర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, కాగిత వరప్రసాదరావు, కాంట్రు శరత్ కుమార్, మోర్ల చినవెంకటేశ్వరరావు, బోయిన సూరిబాబు, కోమ్మనబోయిన వెంకట ఫణీంద్ర కుమార్, బాపట్ల భాస్కరరావు, మద్దిబోయిన తాతయ్య పాల్గొన్నారు.

క్రికెట్ విజేత 'భాష్యం' జట్టు

ప్రజాశక్తి-మార్కాపురం

క్రికెట్‌లో విజేత జట్టుగా మార్కాపురంలోని భాష్యం స్కూల్ విద్యార్థులు నిలిచారు. ఒంగోలులోని శర్మ కాలేజిలో జరిగిన క్రికెట్ ఫైనల్ పోటీల్లో ఒంగోలు-1 బ్రాంచితో మార్కాపురంలోని భాష్యం స్కూల్ జట్టు తలపడింది. రెండు పరుగుల తేడాతో భాష్యం స్కూల్ జట్టు విజయం సాధించింది. ప్రకాశం జోన్-2 ఇ.ఓ. పి.శ్రీకృష్ణ గణేష్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ కెవి నాగరాజు అధ్యక్షతన క్రికెట్ పోటీలను నిర్వహంచారు. క్రికెట్ మానసిక ఉల్లాసాన్ని కలిగించడానికి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదపడుతుందన్నారు. విజేతలను శుక్రవారం భాష్యం స్కూల్ నందు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతగా నిలిచిన స్కూల్ విద్యార్థుల జట్టును అభినందించారు. కార్యక్రమంలో లిటిల్ బాయ్స్ ఇన్‌చార్జి ఎన్ హేమసుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల కొనుగోలు విషయంలో

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- రేషన్ అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలి
- కలెక్టర్ తమీమ్‌అన్సారియా

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

పంటలను కాపాడుకోవడంలో, వాటిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించడంలో ఒక్క రైతు ఇబ్బంది ఎదుర్కోకూడదని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. వ్యవసాయ సివిల్ సప్లై అధికారులు ఈ విషయాలలో సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియపై సంబంధిత శాఖ అధికారులతో శుక్రవారం ఆమె ప్రకాశం భవనంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యాన్ని విక్రయించే క్రమంలో ప్రభుత్వ అధికారుల నుంచి ఇబ్బందులు ఎదురైనట్లుగానీ, వర్షాల నుండి తమ పంట ఉత్పత్తులను



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

కాపాడుకోవడానికి అవసరమైన టార్పాలిన్ పట్టాలు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని, ఒక్కరైతు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును సివిల్ సప్లై డి.ఎం. వరలక్ష్మి ఈ సందర్భంగా కలెక్టర్ కు వివరించారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేషన్ బియ్యం ఎట్టిపరిస్థితులలోనూ పక్కదారి పట్టరాదని స్పష్టం చేసినందున క్షేత్రస్థాయిలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తూ నిఘా పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, ఏ.పి.ఎం.ఐ.పి. పి.డి. పి.వి. రమణ, జిల్లా మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు ఉపేంద్ర, ప్రకతి సేద్యం డి.పి.ఎం. సుభాషిణి, మండల వ్యవసాయ అధికారులు, ఎం.ఎల్.ఎస్. పాయింట్ ఇన్చార్జిలు, ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటి తహాశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు

రేషన్ అక్రమార్కుల వెన్నులో వణుకు పుట్టాలి: జేసీ

రేషన్ బియ్యంలో అక్రమాలకు పాల్పడే వారి వెన్నులో వణుకుపుట్టేలా రైస్ మిల్లులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంయుక్త కలెక్టర్ గోపాలకృష్ణ చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మేయర్ నివాసంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగర మేయర్ గంగాడ సుజాత నివాసంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, ఆయన సతీమణి నాగసత్యలత, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్.విజయ్‌కుమార్, టిడిపి ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు, టిడిపి ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, జనసేన నాయకులు కంది రవిశంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు



కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పాల్గొన్నారు. సెమీ క్రిస్మస్ కు హాజరైన అతిథులకు మేయర్ గంగాడ సుజాత, ఆమె భర్త అరుల్‌రాజ్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు క్రిస్మస్ కేకును కట్ చేశారు.

మేస్త్రీల ఆందోళన పట్టించుకోకపోవడం దారుణం

కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో తొలగించిన మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని గత 48 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమని సిఐటియు నగర అధ్యక్షులు సిహెచ్.రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాలుగో రోజుకు చేరాయి. నాలుగో రోజు దీక్షలను రాంబాబు ప్రారంభించి.. మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా మేస్త్రీలుగా పనిచేస్తున్న వారిని విధుల నుంచి తొలగించడాన్ని తప్పుపట్టారు. రాజకీయకక్ష సాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి



దీక్షలో కూర్చున్న మేస్త్రీలు

తీసుకోవాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జె.ఉదయ్‌కిరణ్ నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి టి.మహేష్, కార్మికులు సిహెచ్ వెంకటేశ్వర్లు, భరత్, గోపి, జాకీర్ హుస్సేన్, శ్యామ్, రామకష్ణ, అనిల్, రమేష్, చందు, నాని, తదితరులు పాల్గొన్నారు.

మస్టర్ పాయింట్ల వద్ద నిరసన

తొలగించిన మేస్త్రీలను విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మేస్త్రీలకు మద్దతుగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు నగరంలోని ఐదు మస్టర్ పాయింట్ల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, యూనియన్ నగర గౌరవాధ్యక్షులు టి.మహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టీ విజయమ్మ, జి.నరసింహ, ఆర్.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, బి.సుబ్బారావు, యు.రత్నకుమారి, కె.మోహన్‌రావు, లక్ష్మీకాంతం, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు యుటిఎఫ్ టెస్ట్ పేపర్లు పంపిణీ చేస్తున్న దాతలు

దాతల సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - సిఎస్ పురం

పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని సిఎస్ పురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు జె పోతురాజు తెలిపారు. పాఠశాలలో 1994-95వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో 84 మంది విద్యార్థులకు ఉచితంగా యుటిఎఫ్ టెస్ట్ పేపర్లను శుక్రవారం పంపిణీ చేశారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకటరామయ్య, షేక్ పాదుషా, పూర్వ విద్యార్థులు షేక్ షమ్మీ, కె రమేష్, యుటిఎఫ్ నాయకులు జె వెంకటరావు, హెచ్ వీరాంజనేయులు, ఐ కొండయ్య, తిరుపతయ్య, వేమ నారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి నుసుం నాగిరెడ్డి

సమన్వయంతో పనిచేసి అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి - కురిచేడు

మండల స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో సమస్యలు సాధ్యమైనంత వరకు పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేయాలని జెడ్‌పిటిసి నుసుం నాగిరెడ్డి అన్నారు. మండల సర్వ సభ్య సమావేశం ఎంపిపి బెల్లం కోటేశ్వరమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో వివిధ విభాగాల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి నివేదికలను వివరించారు. కొంత మంది అధికారులను ప్రజా ప్రతినిధులు ఆయా శాఖల్లో జరిగిన పనులను ప్రశ్నించారు. విద్యుత్ సమస్యపై విద్యుత్ అధికారులను పలువురు సభ్యులు ప్రశ్నించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్య గురించి ఎన్నిసార్లు చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపిడిఒ బి సతీష్ బాబు, ఎంఇఒ ఆర్ వస్త్రాం నాయక్, ఇతర విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

21న చీమకుర్తిలో విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 21న శనివారం చీమకుర్తిలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. చీమకుర్తి మునిసిపల్ కార్యాలయంలో విజయవాడ కన్స్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెస్సెల్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సిజిఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ ఎన్ విక్టర్ ఇమ్మానుయేలు, ఫోరం సభ్యులు కె వెంకటేశ్వర్లు పాల్గొంటారని అన్నారు. కావున దర్శి డివిజన్‌లోని చీమకుర్తి, పొదిలి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, తాళ్ళూరు, ముండ్లమూరు, కురిచేడు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను వ్రాతపూర్వకంగా అందజేయాలని కోరారు. ఫిర్యాదులో సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి అడ్రస్, సెల్ నెంబరు వివరాలను అర్జీతో అందజేసి తమ సమస్యలను అధికారులకు వివరించాలని సూచించారు.

నేడు పిపి ఛానల్ ఛైర్మన్ ఎంపిక

ప్రజాశక్తి - శింగరాయకొండ

సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో చెరువు సంఘాల ఎన్నికలు పూర్తయ్యాయి. దానికి సంబంధించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాలేరు బిట్రగుంట సప్లై ఛానల్ ఛైర్మన్ ఎంపిక ఉంటుందని అధికారులు శుక్రవారం తెలిపారు. దీనికి సంబంధించి పాలేరు, బిట్రగుంట ఛానల్ పరిధిలోని చెరువు సంఘాల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు. ఈ ఎన్నికలకు ఒంగోలు ఆర్‌డిఓ ప్రసన్నలక్ష్మి హాజరవుతారని తెలిపారు.

అక్రమ కేసులు తొలగించాలి

టిడిపి దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



ఎస్పీని కలిసిన వినతి పత్రం అందజేస్తున్న టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి - దర్శి

ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌ను తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీతో ఆమె మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో శాంతి భద్రతలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన ఆరు నెలల కాలంలో దర్శిలో ప్రశాంతతకు కృషి చేసిన పోలీస్ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. నామె ఎస్పీతో మాట్లాడుతూ బొట్ల పాలెం, వీరాయపాలెం, దర్శి, కురిచేడు రోడ్‌లోని ఎన్ఎపి ఆఫీస్ వద్ద జరిగిన సంఘటనలను ఆమె వివరించారు. తమది ప్రజా ప్రభుత్వం, ప్రజల కోసం, ప్రజల హక్కుల కోసం, ప్రజల అవసరాల కోసం ప్రజలు స్వేచ్ఛగా జీవించేందుకు తమ ప్రభుత్వం పని చేస్తుందని, అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం సహకరి స్తున్నారని కోరారు. ఎన్నికల సందర్భంగా వివిధ గ్రామాల్లో అమాయక ప్రజలపై నమోదు చేసిన కేసులు తొలగించాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో దర్శి టిడిపి నాయకులు దారం సుబ్బారావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు ఎస్‌వి రామయ్య పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు



గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దారు రజనికుమారి

ప్రజాశక్తి - కురిచేడు

మండలంలో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు పరిష్కరించే దిశగా రెవిన్యూ సదస్సులు ఉపయోగపడుతున్నాయని పలువురు వాఖ్యానిస్తున్నారు. రెవిన్యూ గ్రామ సదస్సు స్థానిక పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహశీల్దారు రజిని కుమారి, ఆర్ఐ నాగరాజు, విఆర్ఓ కె నాగరాజు, సర్వేయర్ గోపి, ఇతర రెవిన్యూ అధికారులు పాల్గొని సభలో వచ్చిన వివిధ భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నాలు చేశారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను భూ యజమానులు అధికారుల దృష్టికి తీసుకొని రాగా వారికి సాధ్యమైనంతవరకు పరిష్కరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కురిచేడు గ్రామానికి చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనకనమిట్ల : భూ సమస్యలు శాశ్వత పరిష్కారమే రెవిన్యూ సదస్సుల ఉద్దేశమని తహశీల్దార్ ఆవుల సురేష్ అన్నారు. మండలంలోని చిన్నారికట్లలో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా భూ వివాదాలు, చేర్పులు - మార్పులు నెలకొన్న కారణంగా ఈ రెవెన్యూ సదస్సులో ఆ సమస్యలకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని అన్నారు. ఈ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకొని భూ వివాదాలకు స్వస్తి పలకాలని అన్నారు. ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రెవెన్యూ యంత్రాంగం అందరూ ఈ సదస్సుకు వచ్చినందున కొన్ని సమస్యలను ఇక్కడే పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం ఎస్సీ కాలనీ వీధుల్లో తిరిగి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు మీ వద్దకు వచ్చినప్పుడు మీ సమస్యలను స్వచ్ఛందంగా వచ్చి తెలియజేసుకోవాలని సూచించారు. సదస్సులో 23దరఖాస్తులు వచ్చాయని, వాటిలో నాలుగు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మహాదేవరెడ్డి, విఆర్ఓలు కుందురు రాజశేఖర్‌రెడ్డి, రమేష్, దిలీప్‌కుమార్, మాజీ సర్పంచ్ దేవిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎలమందారెడ్డి, టిడిపి నాయకులు బరిగె బాలయ్య, సచివాలయ సర్వేయర్లు రామాంజనేయులు, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



తహశీల్దార్ సురేష్‌కు దరఖాస్తులను అందజేస్తున్న దృశ్యం

బాగా చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలి

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు బాగా చదివి ఆదర్శ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లాపరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక శాసన సభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శివరాజ్ నగర్‌లోని మోడల్ స్కూల్లో బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆల్ ఇన్ వన్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్లో పిల్లలందరికీ బెడ్లు తమ ట్రస్టు ద్వారా ఇస్తామని హామీ ఇచ్చారు. వాటర్ ప్లాంట్ జిల్లా పరిషత్తు నిధులు ద్వారా గాని, తమ ట్రస్టు ద్వారా గాని ఏర్పాటు చేస్తామని అన్నారు. 2009లో తాను ఎన్నికల్లో గెలిచి నప్పుడు శాసన సభ్యునిగా పాఠశాలను ఏర్పాటు చేశామని, అదేవిధంగా హాస్టళ్లు కూడా ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కావలసిన వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం లేనందున ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి బస్సులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. పాఠశాలకు అన్ని విధాల సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షేక్ అసినాబాను, కౌన్సిలర్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆల్ ఇన్ వన్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

ఏసుక్రీస్తు బోధనలు అందరికీ అనుసరణీయం

పాస్టర్లకు దుస్తులు పంపిణీ సందర్భంగా శాసన సభ్యులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ప్రజాశక్తి-దర్శి

ప్రేమ, దయ, కరుణ కలిగిన ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శనీయమని జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, స్థానిక శాసన సభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక పిజిఎన్ కాంప్లెక్స్ కళ్యాణ మండపంలో 500పైగా పాస్టర్ల దంపతులకు బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు యేసుక్రీస్తు బోధనలను వినిపించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా పాస్టర్లకు దుస్తులు అందజేయడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఎప్పుడు పాస్టర్లను గౌరవిస్తామని అన్నారు. ముందుగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని పాస్టర్లు, పాస్టర్ల దంపతులు పాల్గొన్నారు.



పాస్టర్ కుటుంబాలకు దుస్తులు అందచేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి

బెల్టుషాపు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గ్రామంలో మద్యం బెల్టు షాపు కారణంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. యువకులు మద్యం వైపు మల్లుతున్నారని తెలిపారు. అనేక కుటుంబాలు మద్యం వల్ల ఇబ్బంది పడుతున్నాయని తెలిపారు. గతంలో రెండుసార్లు మద్యం బెల్ట్ దుకాణం తొలగించి అర్జీలు ఇచ్చినా ఇంతవరకూ ఫలితం లేదని తెలిపారు. తక్షణమే బెల్ట్ మద్యం షాపును తొలగించాలని, బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దారు సింగారావు మాట్లాడుతూ గ్రామంలో బెల్టు షాపు నిర్వహించకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. రెవెన్యూ సదస్సులో 8 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్ర మంలో మండల సర్వేయర్ సురేష్, విఆర్‌ఒలు, టిడిపి నాయకులు జాగర్లమూడి భాను ప్రకాష్ , కూనంనేని జనార్ధన్ రావు, శంగారపు బ్రహ్మయ్య, శంగారపు శ్రీను, సర్పంచి మేడూరి అంజయ్య, శంగారపు కష్ణ ,ఎనికపాటి సుందర్రావు, ఎనికపాటి కష్ణ ,శంగారపు మురహరి, పాటిబండ్ల సత్యవతి,శ్రీనివాసరావు ,మద్దిరెడ్డి రమణారెడ్డి పాల్గొన్నారు.



అధికారులకు అర్జీ అందజేస్తున్న గ్రామస్తులు

యద్దనపూడి : మండల పరిధిలోని గన్నవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు రవికుమార్ మాట్లాడుతూ సమస్యలపై రెవెన్యూ సదస్సులో ఇచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 10 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఏసుమ్మ, ఎంపిటిసి జి. సతీష్, సీనియర్ అసిస్టెంట్ భాస్కరరావు, విఆర్‌ఒ సత్యం, గ్రామ నాయకులు రంగయ్య రైతులు పాల్గొన్నారు.



ఎఎస్‌ఐలు రామయ్య, డేవిడ్

ఎఎస్‌ఐగాలు రామయ్య, డేవిడ్

ప్రజాశక్తి బాపట్ల

బాపట్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని చందోలు పోలీసు స్టేషన్ ఎఎస్‌ఐలుగా బి.రామయ్య, డేవిడ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. చందోలు హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డేవిడ్, చుండూరు హెడ్ కానిస్టేబుల్‌గా బి.రామయ్య ఉద్యోగోన్నతిపై ఎఎస్‌ఐలు విధుల్లో చేరారు. ఈ సందర్భంగా చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది ఎఎస్‌ఐలు రామయ్య, డేవిడ్‌ను అభినందించారు.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

ప్రజాశక్తి - చీరాల

ఆధునిక వైద్యాన్ని అందుబాటులోకి తెస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో తమ వైద్యశాల ఎప్పుడూ ముందు ఉంటుందని ఐకాన్ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ ఎస్. కొండలరావు తెలిపారు. నర్సరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కుమార్తె ప్రముఖ (న్యూరాలజిస్ట్) మెదడు,నరముల వైద్య నిపుణులు డాక్టర్ చదలవాడ అమూల్య చీరాల ప్రాంత ప్రజలుకు వైద్య సేవలు అందించేందుకు ప్రతి శుక్రవారం తమ వైద్యశాలో అందుబాటులో ఉంటున్నట్లు డాక్టర్ కొండలరావు తెలిపారు. వైద్య సేవలు అందించేందుకు వచ్చిన శు క్రవారం హాస్పిటల్ వచ్చిన డాక్టర్ అమూల్యకు డాక్టర్ కొండలరావు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు..



డాక్టర్ అమూల్యకు పుచ్ఛగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ కొండలరావు

కషాయం తయారీ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ప్రకతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలపై దశపర్ని కాశయాన్ని పిచికారీ చేయడం ద్వారా నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చునని మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని సూరేపల్లి గ్రామంలో వాక నాగావజరం ఇంటి వద్ద శుక్రవారం దశపర్ని కషాయం తయారు చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ మేకలు గొర్రెలు తిననటువంటి పది రకాల ఆకులు, అరకేజీ పసుపు, కిలో వెల్లుల్లి, అరకేజీ అల్లం, కిలో పచ్చిమిర్చి, అర కేజీ ఇంగువతో 200 లీటర్ల కాశయం తయారు చేయవచ్చునని తెలిపారు. ఈ కశాయాన్ని పంటలపై పిచికారీ చేస్తే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి దోవా ఝాన్సీ రాణి, సిఆర్‌పిలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి- అద్దంకి

అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఎపి ఎస్‌సి,ఎస్‌టి, బీసీ,మైనారిటీస్ ఐక్యవేదిక డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక బంగ్లారోడ్‌లోని అంభేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్ మాట్లాడుతూ అంబేద్కర్ కల్పించిన హక్కుతో మంత్రి పదవి అలంకరించిన అమిత్‌షా ఆ పదవిలో ఉండే హక్కు కొల్పోయాడని తెలిపారు. పదవికి రాజీనామా చేసి భారత ప్రజలకు క్షమాపలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక ట్రజరర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అంకం నాగరాజు, విశ్రాంత ఆర్‌జెడి యు.దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, తాళ్ళూరి బాబూరావు, నక్కా కాంతారావు, మందా జోషప్, జగన్నాధం యోహాను, జ్యోతి రోశయ్య, మోటూరి సుదర్శన్, జంధ్రాజుపల్లి ప్రభాకరరావు, హనుమంత రావు, సయ్యద్ హుసేన్ పాల్గొన్నారు.

రేపల్లె : కేంద్ర హోంమత్రి అమిత్‌షా అంబేద్కర్‌పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ దళిత, ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జైభీమ్ రావ్ భారత్ పార్టీ రేపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి దోవా రమేష్ రాంజీ, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) రేపల్లె ఉపాధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వ్యవస్థలోని ప్రధాన భాగమైన పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ బద్ధంగా పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై హోంమంత్రిగా రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన అమిత్ షా అహంకారంతో అంబేద్కర్‌పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అమిత్‌షా పార్లమెంటరీ సభ్యత్వం రద్దుచేయాలన్నారు. మంత్రి పదవి నుంచి అమిత్‌షా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోడీ వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సామాజిక, అంబేద్కర్,ప్రజా సంఘాలు నేతలు సిహెచ్,మణిలాల్, న్యాయవాదులు దారం సాంబశివరావు, కర్రా ప్రతాప్, తెనాలి దీన రాజు, నల్లూరి వెంకటేశ్వరరావు, డి. కష్ణప్రసాద్ నీలా జోజి బాబు, నలిగిలి సురేష్, బిఎస్‌పి నాయకులు కట్టుపల్లి సుధీర్, నేరుసు వెంకటరావు, నాయుడు, పి.సుబ్బారావు,లక్ష్మణరావు , కె.ఆశీర్వాదం పాల్గొన్నారు.



రేపల్లెలో నిరసన తెలుపుతున్న నాయకులు

మార్టూరు రూరల్ : కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక రామనగర్ నేతాజీ నగర్‌లోని బొమ్మల సెంటర్ వద్ద నిరసన తెలిపారు. సమతా సైనిక్‌దళ్ పర్చూరు నియోజకవర్గ కన్వీనర్ బొల్లాపల్లి బెన్ని బాబు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టిపాటి పవన్. గొట్టిపాటి రవితేజ, గోపతోటి కిషోర్, దారా సురేష్. గొట్టి పాటి నాని, గొట్టిపాటి పెద్దబాబు, భాస్కర్ పాల్గొన్నారు.



అద్దంకిలో నిరసన తెలుపుతున్న నాయకులు



మార్టూరులో నిరసన తెలుపుతున్న నాయకులు



చీరలు అందజేస్తున్న దాతలు

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో విశ్రాంత తహశీల్దారు తాతా బాలసుబ్రమణ్యం ఆర్థిక సౌజన్యంతో పసుమర్తిపాలెంలోని డాక్టర్ క్లవ్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పేద మహిళలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. అనంతరం దాత బాలసుబ్రహ్మణ్యంను రోటరీ క్లబ్ ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ఎజి షేక్ మహమ్మద్ రఫీ, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, అంజాద్ బాషా, ఎజిపి రమేష్ బాబు, ఫాదర్ యేసుబాబు, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళీ కష్ణ, కాకర్ల వెంకటేశ్వర్లు, కొల్లా భువనేశ్వరి, పువ్వాడ రామకోటేశ్వరావు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి-వేటపాలెం

మండల పరిధిలోని పాపాయపాలెంలో రైతులు సాగు చేసిన వరి పంట ఎఒ ఐ. కాశీ విశ్వనాధ్ శుక్రవారం పరిశీలించారు . ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ వరిలో కంకినల్లి, నల్ల కంకి తెగులు ఉన్నట్లు తెలిపారు. వాటి నివారణకు ప్రొఫైనోఫాస్ రెండు మిల్లీలీటర్లు లేదా డైకోఫాల్ ఐదు మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి పిచికారీ చేయాలన్నారు. కొన్ని పొలాల్లో వరి మానుకాయ తెగులు ఆశించినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులను అనుసరించి 50 శాతం వెన్ను బయటికి వచ్చే సమయంలో సాయంత్రం వేళలో కార్బన్‌డిజం ౢ గ్రాము లేదా ప్రోపికోణజోల్ గ్రామును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు వినయ్ కుమార్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు అధిక సాంద్రత కలిగిఉన్న పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి తక్కువ సాంద్రత ఉన్న పురుగుమందులను పిచికారీ చేసుకోవాలని మార్టూరు ఉద్యానవనశాఖాదికారి బి. హనుమంతనాయక్ తెలిపారు. మండల పరిధిలోని కొమ్మాలపాడు గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన బొప్పాయి, మిరప, కూరగాయ తోటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బొప్పాయి, మిరప, కూరగాయల తోటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను గురించి రైతులకు వివరించారు. మిరప పూత పిందె దశలో ఉందని ఈ క్రమంలో నైట్రోజన్ ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని రైతులకు సూచించారు. మొక్కలకు న్యూట్రియన్స్ ఎక్కువగా అందించాలన్నారు. కాల్షియం, బోరాన్, జింక్ మెగ్నీషియం మరియు ఫొటోష్ అధికంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. మొక్కలకు జింకు, బోరాన్ వంటి బలాలను అందించడం వల్ల లేత ఆకులు త్వరగా బిరుసుబారి రసం పీల్చే పురుగుల ఉధృని తట్టుకుంటాయని తెలిపారు. పూత కూడా అధికంగా వస్తుందన్నారు.

అనారోగ్యంతో టైలర్ మృతి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామానికి చెందిన టైలర్ బట్టు పోతురాజు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతికి సంతాపంగా టైలర్లు తమ షాపులను మూసివేసి సంతాప వ్యక్తం చేశారు. పోతురాజు మతి టైలరింగ్ అసోసియేషన్‌కు తీరని లోటని తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మహమ్మద్ ఇస్మాయిల్, పి.నాగేశ్వరరావు, నాగిశెట్టి సుబ్బారావు, బషీర్, వేల్పూర్ నాగేశ్వరరావు, నాగరాజు, మహమ్మద్ అనీఫ్ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మార్కాపురం డిఎస్‌పి నాగరాజు

ప్రజాశక్తి-మార్కాపురం

ద్విచక్ర వాహనదారులంతా ఇకపై హెల్మెట్ తప్పనిసరిగా ధరించాల్సిందేనని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ యు.నాగరాజు హెచ్చరించారు. హెల్మెట్ వాడకంపై అవగాహన ప్రదర్శనను డిఎస్‌పి నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు, యువకులు సంయుక్తంగా హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ అవగాహన కల్పించారు. అనంతరం డిఎస్‌పి నాగరాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో అత్యధికంగా హెల్మెట్ లేకపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయన్నారు. శరీరంలో ఏ భాగం దెబ్బతిన్నా కోలుకునే అవకాశం ఉందని, తలకు తీవ్రమైన గాయమైతే మరణం తప్పదని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారే దెబ్బతింటున్నారన్నారు. ఈ ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబాలు ఆధారం కోల్పోవడం జరిగిందన్నారు. కుటుంబాల క్షేమం కోసం హెల్మెట్ ధరించాలన్నారు. ఇకపై హెల్మెట్ లేని ప్రయాణాలకు జరిమానాలు భారీగా ఉంటాయని హెచ్చరించారు. గతంలో మాదిరిగా హెల్మెట్ లేకుండా ఇకపై ప్రయాణం చేసినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సిందేనన్నారు. కార్యక్రమంలో మార్కాపురం సిఐ పి.సుబ్బారావు, పట్టణ ఎస్ఐ ఎం.సైదుబాబు, టూటౌన్ ఎస్ఐ డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు, మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం.అంకమరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగరాజు

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి

- ఎస్పీ ఏఆర్.దామోదర్
- జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆసుపత్రి నిర్మాణ పనుల భూమిపూజ

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

పోలీసుల సంక్షేమం మరియు పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించి వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం వారి సహకారంతో శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లా ఎస్పీ నూతన పోలీస్ హాస్పిటల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సంక్షేమమే లక్ష్యంగా వారికి అత్యాధునిక సదుపాయాలతో మెరుగైన వైద్యం, వైద్య పరీక్షల కోసమే ఈ హాస్పిటల్ నిర్మించడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందికి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పోలీసులు రాత్రింబవళ్లు పనిచేయడంతో పాటు ప్రతిరోజూ ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ అధిక ఒత్తిడిని గురవుతున్నారని, కావున పోలీస్ సిబ్బంది ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే విధులు సమర్థంగా నిర్వహించగలరన్నారు. పోలీసులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, తరచూ హెల్త్ చెక్-అప్ చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు నడక, వ్యాయామం, యోగ వంటివి దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. హాస్పిటల్ నిర్మించటానికి ముందుకు వచ్చిన కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం వారికి ఎస్పీ ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్‌బాబు, కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టి.గిరినాయుడు, హాస్పిటల్ సిఒఒ కె.అంకిరెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ శ్రీహరిరెడ్డి, పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, ఆర్ఐలు రమేష్ కృష్ణన్, సీతారామిరెడ్డి, హౌసింగ్ బోర్డు ఈఈ పార్థసారధి, ఆర్ఎస్సైలు మరియు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎస్పి దామోదర్

జిజిహెచ్‌లో అందుబాటులో ఈఎన్‌జి పరికరం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహా నగరాలు, పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే లభ్యమయ్యే ఈఎన్‌జి (ఎలెక్ట్రానిస్టాగ్మోగ్రాఫి) పరికరం ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అందుబాటులోకి వచ్చింది రూ.35 లక్షల విలువైన పరికరాన్ని శుక్రవారం జిజిహెచ్ ఈఎన్‌టి విభాగంలో అమర్చారు. ఈ సందర్భంగా జిజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ జమున, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ ఏడుకొండలరావు మాట్లాడుతూ విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కాకినాడతో పాటు ఒంగోలు జిజిహెచ్‌కు ఈ పరికరం అందుబాటులోకి రావడం పేషంట్లకు పెద్ద వరమన్నారు శుక్రవారం జిజిహెచ్ ఈఎన్‌టి విభాగంలో ఈ పరికరాన్ని వీరు ప్రారంభించారు. డిప్యూటీ సూపరింటెండెంట్, ఈఎన్‌టి విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ పరికరాన్ని ప్రారంభించారు. సిబ్బందిని వినియోగించి వారికి సరైన శిక్షణ ఇచ్చి.. పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ పరికరంతో అనేక నిర్ధారణ పరీక్షలు చెయ్యవచ్చని ఈఎన్‌టి విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, సిఎస్ ఆర్ఎమ్ఓ డాక్టర్ మాధవీలత, ఈఎన్‌టి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఈఎన్‌జి పరికరాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్, సూపరింటెండెంట్

జిఎస్‌డిపి వృద్ధి రేటు లక్ష్యంగా పనిచేయండి

అధికారులకు కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లా సమగ్రాభివృద్ధిలో భాగంగా 15 శాతం జిఎస్‌డిపి వృద్ధిరేటే లక్ష్యంతో వ్యవసాయం అనుబంధ శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాలులో వ్యవసాయ అనుబంధ రంగాల 15 శాతం జిఎస్‌డిపి వృద్ధి రేటే లక్ష్యం అనే అంశంపై శాఖల వారీగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో 15 శాతం జిఎస్‌డిపి వద్ధిరేటే లక్ష్యం సాధించేలా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకొని అందుకనుగుణంగా లక్ష్య సాధనకు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కౌలురైతులకు మరింత మంచి చేకూర్చేలా, అందరి సలహాలు, సూచనలు స్వీకరించి నూతన కౌలు రైతు చట్టం అమలు చేయాలన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షిస్తూ.. జిల్లాలో చేపట్టిన 21వ పశుగణన కార్యక్రమాన్ని 2025 జనవరి నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మంజూరైన మినీ గోకులం షెడ్స్‌ను డ్వామా శాఖతో సమన్వయం చేసుకొని సంక్రాంతి నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

మత్స్య శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ.. నిర్దేశించిన విధంగా వృద్ధి రేటు సాధించేలా మత్స్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని అందుకనుగుణంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ (అప్సడా) యాక్ట్ కింద మత్స్యకారులందరినీ రిజిస్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలు జరుగుచున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా మత్స్య శాఖాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబీరాణి, హార్టికల్చర్ అధికారి గోపిచంద్, ఏపీ ఎంఐపి పిడి టీవీ రమణ, జిల్లా సహకార శాఖాధికారి శ్రీనివాసులురెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

23న కలెక్టరేట్ వద్ద నిరసన

సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల పిలుపు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఢిల్లీలో రైతు ఉద్యమాల అణచివేతకు వ్యతిరేకంగా, నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఇన్ అగ్రికల్చర్ మార్కెటింగ్‌ను వ్యతిరేకిస్తూ ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఈ నెల 23న జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఒంగోలు ఎల్‌బిజి భవన్‌లో శుక్రవారం నాడు ఏర్పాటుచేసిన సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు అధ్యక్షత వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రైతు సమస్యలు పరిష్కరించాలని గత 20 రోజులకు పైగా ఢిల్లీ సరిహద్దులో రైతులు ఉద్యమిస్తున్నారన్నారు. మద్దతు ధరలు ఇవ్వాలని జరిగే ఉద్యమాన్ని కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం, హర్యానా రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధంగా అణిచివేస్తున్నాయన్నారు. గ్రేటర్ నోయిడాలో భూములు కోల్పోయిన రైతులను ఉత్తరప్రదేశ్ యోగి ప్రభుత్వం జైల్లో కుక్కిందన్నారు. నేషనల్ పాలసీ ఫ్రేమ్ వర్క్ ఆన్ అగ్రికల్చర్ మార్కెటింగ్ ఆపాలని ఈ నెల 23న ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో అధిక మంది పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్యక్ష, కార్యదర్శులు జె.జయంతిబాబు, పమిడి వెంకట్రావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, కొత్తకోట వెంకటేశ్వర్లు, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్ జె.వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

విభిన్న ప్రతిభావంతుల సమస్యలపై వచ్చిన అర్జీలను సానుకూలంగా పరిష్కరించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కార కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జరిగింది. ఈ సందర్భంగా వారి నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారం కోసం వ్యయ, ప్రయాసలతో, ఆర్థిక ఇబ్బందులతో ఎంతో దూరం నుంచి వచ్చారన్నారు. వీరి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా మానవతా దక్పథంతో పరిష్కరించాలన్నారు. విభిన్న ప్రతిభావంతు లకు వారి వైకల్యాన్ని గుర్తించి సదరం ధ్రువీకరణ పత్రాలను, రేషన్ కార్డు మరియు పెన్షన్ల మంజూరుకు ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని మంజూరుకు చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు అర్చనకు ఆయన సూచించారు. విభిన్న ప్రతిభావంతులకు నెలవారీ మందులను పంచాయతీలలో, మాసంలో రెండుసార్లు 104 వాహనముల ద్వారా ఉచితంగా అందజేస్తారని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక వెసులుబాటు పొందాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల వివరాల నివేదికను తయారుచేసి అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి 11 దరఖాస్తులు వచ్చాయన్నారు.

జిల్లాలో వరి సాగుకు సంబంధించి ఎన్ని ఎకరాల్లో పంట పండించారని, ధాన్యం దిగుమతి, అమ్మకాలు, నిల్వలపై ఆరా తీశారు. వర్షాభావం కారణంగా నిల్వ ఉన్న ధాన్యమునకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు రామకష్ణకు జిల్లా కలెక్టర్ సూచించారు.

జనవరి నెల మొదటి వారంలో లక్ష గృహప్రవేశాల కార్యక్రమం సందర్భంగా గహాల ప్రగతిపై మండల ప్రత్యేక అధికారులను మరియు మండల స్థాయి అధికారులతో వీక్షణ సమావేశం ద్వారా ఆరా తీశారు. గడువులోపు పూర్తి లక్ష్యాలను సాధించని వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్. రెవెన్యూ డివిజన్ అధికారి పి.గ్లోరియా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ జె.వెంకటమురళి